విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 14 మార్చి 2025 8 పేజీలు

ప్రకృతి సంపదకు చెద

- 8 ఏళ్ల క్రితం అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం
- ఎండకు ఎండి, వానకు తడిసి నిరుపయోగం
- పట్టించుకున్న నాథుడులేడు

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన ప్రకృతి సంపద మట్టి పాలైందని మండలంలో సర్వత్రా చర్చ జరుగుతుంది. వివరాలలోకి వెళితే మండలంలోని అంతర్వేదిగూడెం పంచాయతీ పరిధిలోని ఇసు మూరు గ్రామంలో గయ్యాలి భూమిలోని టేకు కలపను సత్యనారాయణ అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా, దౌర్జన్యంగా నరికి అక్రమంగా తరలించుకుపోతున్నాడని ఇసు మూరుకు చెందిన గిరిజనులు 2016లో అప్పటి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. తక్షణం స్పందించిన అప్పటి తహసీల్దారు ఆ కలపను స్వాధీనం చేసుకొని బుట్టాయిగూడెం తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై రెవెన్యూ సిబ్బంది కేసు నమోదు చేసి అంతటితో తమ విధి నిర్వహణ పూర్తయ్యిందని చేతులు దులుపుకున్నారు. తరలించిన కలప స్వాధీనం చేసుకుని నేటికి 8 సంవత్సరాలు పూర్తయినా, సదరు కలపపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా అలసత్వం వహించడంతో ఆ కలప ఎండకు ఎండి, వానకు తడిసి, చెదలు పట్టి నిరుపయోగంగా మారింది. నిబంధనల ప్రకారం అటవీ శాఖ అధికారులకు తెలియజేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, అటవీ శాఖ, ప్రభుత్వ అనుమతులతో బహిరంగ వేలంపాట నిర్వహించి ఉంటే వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తే ప్రజా ప్రయోగ కార్యక్రమాలకు వినియోగించడానికి ఆస్కారం ఉండేది. ఎంతో విలువైన

▶మిగతా 2లో..

కాలుష్యంతో మామిడి రైతులు విలవిల

- రాగూర్ కెమికల్ బల్క్ ఫ్యాక్టరీతో తీవ్ర నష్టం
- కాలుష్య విభాగాధికారికి విన్నవించినా పట్టించుకోని వైనం
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శ

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం తాళ్లపూడి మండలం తుపాకులగూడెం, బీములు గ్రామాల్లో ఉన్న రాగూర్ కెమికల్ బల్క్ ఫ్యాక్టరీ వల్ల మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నెల రోజుల ముందే రైతుల సమస్యలపై, గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కాకినాడ కాలుష్య విభాగ ఈఈని సీపీఐ రైతు సంఘం బృందం

▶మిగతా 2లో..

ఒక్కరితో సర్వే సాధ్యమా?

విశాలాంధ్ర - సీతానగరం: ఆ గ్రామానికి ఒక్క ఉద్యోగితో సర్వే సాధ్యమా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన లక్ష్యంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా పి4 సర్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సర్వే నిర్వహించడానికి సచివాలయాలలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. మండలంలోని వంగలపూడి గ్రామపంచాయతీ పరిధి సచివాలయంలో డిఎ, వెల్ఫేర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపడుతున్న రాజేష్ ఒక్కడే గ్రామం మొత్తం సర్వే నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ సచివాలయం పరిధిలో ఇతర ఉద్యోగులు బదిలీలు, సెలవులపై ఉండడంతో ఈ ఒక్క ఉద్యోగి సర్వే నిర్వహించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే మార్చి 18 నాటికి పి4 సర్వే పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

▶మిగతా 2లో..

వీఆర్ఓలపై అదనపు భారం తగ్గించండి

కలెక్టర్‌కు రెవెన్యూ జేఏసీ వినతి

విశాలాంధ్ర - అమలాపురం : గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ తరుపున కలెక్టర్ మహేష్ కుమార్‌ను కలిసి గ్రామ రెవెన్యూ అధికారులు పడుతున్న ఇబ్బందులు, క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు కలిపి ఒకే వీఆర్ఓను మ్యాపింగ్ చేస్తున్న పరిస్థితుల్లో ఒక సచివాలయానికి ఒక వీఆర్ఓ ఉండేట్లు నిర్ణయం తీసుకోవాలని, వీఆర్వోల కేడర్ తగ్గకుండా చూడాలని, గ్రేడ్-1, 2 విఆర్ఓలకు కామన్‌గా డిడిఓ తహశీల్దార్ ఉండేలా చూడాలని, ఇతర శాఖల పనులు సర్వేలు చేయడం వలన రెవెన్యూ శాఖ పనులు కుంటుపడుతున్నాయని, ఇతర శాఖల పనులు అప్పగించకుండా ఎంపిడిఓలకు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను, జాయింట్ కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వానికి,ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని కోరారు. ఒక సచివాలయానికి ఒక వీఆర్ఓ ఉండి వివిధ విధులలో క్షణం ఖాళీ లేకుండా ఉంటున్న గ్రామ రెవెన్యూ అధికారులకు రెండు సచివాలయాలకు ఒక వీఆర్ఓ అయితే మరింత పని భారం పెరుగుతుందని తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ శాఖకు సంబంధం లేని ఇతర విభాగపు పనులు అప్పగిస్తున్నా రని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే క్రింద స్థాయికి ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ జెఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్,

▶మిగతా 2లో..

నిరుత్సాహం.. నిరాశావాదం

- వైసీపీలో కనిపించని నాటి ఉత్సాహం
- 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో కనిపించని క్యాడర్

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: సామాజిక అవసరాలు, ప్రాంతాల ప్రమేయం లేకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రేరేపితమై సానుభూతి పునాదుల మీద ఆవిర్భవించిన పార్టీ వైసీపీ.. చేసిన మేలు మరవడం, సామాన్య ప్రజలు కృతజ్ఞతాపూర్వకంగా ఇచ్చిన అధికారాన్ని ఐదేళ్ల కాలానికి పరిసమాప్తం చేసుకున్న బలహీన పార్టీగా మిగిలిపోయింది వైసీపీ. బుధవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రేణులు జరుపుకున్న తీరుకు, సరిగ్గా ఏడాది క్రితం జరుపుకున్న తీరుకు ఎంతో తేడా కనిపించింది. 2011 మార్చి 12వ తేదీన ఆవిర్భవించిన వైసీపీ గత 13 సంవత్సరాలలో ఏదో ఒక ఆశతో, లక్ష్యంతో ఆవిర్భావ దినోత్సవాలను జరుపుకుంటుంది. 8ఏళ్లపాటు జగన్ ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేశాయి. ఆ తర్వాత ఐదేళ్ల కాలం అధికార దర్పంతో ఆవిర్భావ దినోత్సవాలను జరుపుకుంది. ఈ సంవత్స రం మాత్రం అందుకు భిన్నంగా ఎలాంటి లక్ష్యం లేకుండా భవిష్యత్తు మీద ఆశ లేకుండా, నిదానంగా,నిరుత్సాహంగా జరుపుకున్నాయి.

ఎన్నికల ఫలితాల ప్రభావం

ఎన్నికల ఫలితాలతోనే వైసీపీ క్షీణ దశకు చేరుకుంది. ఎన్నికల ఫలితాల తరువాత వలసలు పుంజుకున్నాయి. జిల్లాలో 40శాతం క్యాడర్ జగన్ నాయకత్వంపై తిరుగుబాటు చేసి తెలుగుదేశం జెండా పట్టుకున్నారు. వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో టిడిపిలో చేరిపోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే వైసిపి తిరిగి ప్రాణం పోసుకోవాలంటే కొత్తగా మళ్లీ పార్టీ నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ఈ ఏడాది ఆవిర్భావ దినోత్సవం జరిగిన తీరే అందుకు నిదర్శనం. చాలామంది నాయకులు ఈ కార్యక్రమాలలో పాల్గొనలేదు. మెజారిటీ గ్రామాలలో అసలు వైసీపీ జెండానే ఎగరలేదు.

నాయకుల్లో నీరసం

ఐదేళ్లపాటు రాజరికం తరహా అధికారాన్ని అనుభవించిన ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు ప్రస్తుతం జనబాహుళ్యంలో కనిపించడం లేదు. అంతా అజ్ఞాతంలోకి

▶మిగతా 2లో..

మొల్ల జీవితం ఆదర్శనీయం

కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు : కవయిత్రి మొల్ల మాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత, విద్యార్థినీ విద్యార్థులు స్ఫూర్తి పొందాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టర్ బంగ్లా సమావేశ మందిరంలో కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహిం చారు. మొల్ల చిత్రపటానికి కలెక్టర్ వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రామాయణాన్ని సరళమైన భాషలో

▶మిగతా 2లో..

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం, మఠంగూడెం, లింగపాలెం పంచాయతీలను డి.ఎల్.పి.ఓ సుందరి, లింగపాలెం మండల పంచాయతీ విస్తరణ అధికారి రత్నకుమార్ తనిఖీలు నిర్వహించారు. పంచాయితీలలో

పరిశుభ్రత,డంపింగ్ యార్డుల వినియోగంపై పరిశీలన చేశారు. గ్రామాలలో ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా ఉండేలా తీసుకోవలసిన చర్యలను,గ్రామాలలో చెత్త నిల్వలు ఉండకుండా తీసుకోవలసిన చర్యలపై పంచాయతీ కార్యదర్శు లకు, సిబ్బందికి సూచనలు చేశారు.వేసవి సీజన్లో తాగునీటి ఎద్దడి లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వీరితోపాటు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న స్వయం ఉపాధి సోపానం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలంలో బిసి / కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ కార్పోరేషన్ ద్వారా చంద్రన్న స్వయం ఉపాధి పథకానికి 2024-25 సంవత్సరాలకు సంబంధించి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. రెడ్డయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఆయన మాట్లాడుతూ దీనికి సంబంధించి బీసీ, కాపు కార్పొరేషన్, కాపు కమ్యూనిటీకి సంబంధించి చంద్రన్న స్వయం ఉపాధి పథకం, జనరిక్ ఫార్మసీల పథకం కొరకు ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరుకు అర్హులైన బీసీ, కాపు కార్పొరేషన్ లబ్ధిదారుల గుర్తింపు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు, అభ్యర్థులు 21-60 సంవత్సరాల మధ్య వయసు గలవారై ఉండాలని అర్హులైన వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేం దుకు ఈనెల 22 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో టైలరింగ్ యూనిట్స్ మాత్రమే దరఖాస్తు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈనెల 22 వరకు స్వీకరించిన దరఖాస్తులను 23 నుంచి 25 వరకు ఎంపీడీవో, బ్యాంకు అధికారుల పర్యవేక్షణలో స్క్రూటిని జరుగుతుందని, దరఖాస్తులను వివిధ దశలలో పరిశీలించిన అర్హులైన లబ్ధిదారుల జాబితా మే 21 నుండి జూన్ పదోతేదీ మధ్యలో ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారుడు దరఖాస్తు తో పాటు తప్పనిసరిగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత నకలు పత్రాలు, అభ్యర్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తప్పనిసరిగా జత చేయాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక మెటీరియల్ అందజేత

విశాలాంధ్ర-లింగపాలెం: సింగగూడెంలోని10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు గ్రామానికి చెందిన కోటగిరి ధీరజ్ కృష్ణ(చిన్నబాబు) పరీక్షలు రాసే విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం

అందిస్తున్నట్లు ఈయన పేర్కొన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు.ఈకార్యక్రమంలో కోటగిరి హరీష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఒంటిపూట బడులు

విశాలాంధ్ర -ఏలూరు: విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీ నుండి ఏలూరు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోగల పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రారంభమవుతాయని డీఈవో ఎం. వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పాఠశాలలు జరుగుతాయని ఆమె తెలిపారు.

ఆదర్శనీయం

(1వ పేజీ తరువాయి)

అందరికీ అర్థమయ్యేలా తక్కువ వ్యవధిలో రచించిన గొప్ప కవయిత్రి అని కొనియాడారు. ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని సాహసోపేతంగా రామాయణం రచించారని అన్నారు. మారుమూల ప్రాంతం నుండి వచ్చిన కవయిత్రి అని ఆమె పేరుతో ప్రభుత్వం స్టాంప్ కూడా విడుదల చేసిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఆర్.వి.నాగరాణి, బి.సి. కార్పొరేషన్ ఎడి ఎన్. పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

నిరాశావాదం

(1వ పేజీ తరువాయి)

వెళ్ళిపోయారు. నాయకులు ఇంతలా డీలా పడిపోవడానికి ఒక విధంగా ఎన్నికలలో వీరికి ఎదురైన ఘోర పరాజయం ఒక కారణం అయితే, వీరి ఐదేళ్ల ప్రవర్తన మరో కారణం. ఒక్క ఛాన్స్ ఇచ్చి చూద్దాం అని దయ చూపిన ప్రజలపై వీరు దండయాత్ర చేశారు. గంపెడు మట్టి కావాలన్నా.. నేతల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే విధంగా పాలన సాగించారు. రాజకీయ కక్షలకు పాల్పడ్డారు. రాజకీయ కారణాలతో సామాన్యుల మీద తప్పుడు కేసులు పెట్టించారు. ప్రజలందరూ చూస్తూ ఉండగా బహిరంగంగా అవినీతి,అక్రమార్జనకు పూనుకున్నారు. సుదీర్ఘకాలం రాజకీయాలలో కొనసాగి రెండు, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి,మంత్రి పదవులు అనుభవించిన నాయకులు సైతం జనం మధ్యకు రావడానికి మొహమాటపడుతున్నారంటే పార్టీ పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు.14 ఏళ్ల వైసిపి ఆవిర్భావంలో ఎప్పుడూ కనిపించనంత నిరుత్సాహం.. నిరాశావాదం ఈ ఏడాది కనిపించడం చెప్పుకోదగ్గ రాజకీయ విశేషం.

భారం తగ్గించండి

(1వ పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షులు సాధనాల ఎల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మల్లేష్ అల్లాడి సహ అధ్యక్షులు కెవి గణేష్, కొత్తపేట డివిజన్ నుంచి ఈవీవీ సత్యనారాయణ, బాబ్జి , రామచంద్రపురం డివిజన్ నుండి రామకృష్ణ, విష్ణు, సత్తిబాబు, అమలాపురం డివిజన్ నుండి రాజేష్, కె.బాలాజీ, శివకుమార్, పి. వెంకటేశ్వరరావు, హరి, సత్యవతి, జిల్లాలోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సాధ్యమా?

(1వ పేజీ తరువాయి)

జారీ చేసింది. కానీ మండలంలో పలు పంచాయతీల పరిధిలో సిబ్బంది కొరతతో సర్వే మందకొడిగా సాగుతోంది. దీనికి తోడు ఏ ఎన్ ఎమ్, విలేజ్ సర్వేయర్లు ఈ సర్వేలో తమ తమ విధుల్లో ఈ సర్వేలో పాల్గొనడం లేదని అధికారులు తెలిపారు. సర్వే వేగవంతం కావాలంటే ఉన్న ఉద్యోగులు పూర్తి స్థాయిలో వినియోగించు కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవన్నీ ఇలాగే ఉంటే ప్రస్తుతం దాళ్వా పంట చేతికొచ్చే సమయం కావడం, మరో పక్క ఈ పంట నమోదు చేయాల్సిన వివిఏలు కూడా ఈ సర్వే నిర్వహించవలసి వస్తుంది. ఈ సమస్యల పై అధికారులు దృష్టి సారించి ప్రభుత్వం ఆదేశించిన సర్వే సవాళ్లను అధిగమించాల్సి ఉంది.

రైతులు విలవిల

(1వ పేజీ తరువాయి)

కలిసింది. ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించాలని సీపీఐ కోరి ఇప్పటికి నెలరోజులు దాటుతున్న సమస్యలు పరిష్కారం చేయలేదని సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పూతలు విపరీతంగా రాలిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తామరగడి, సూరయ్యపేట, బీమలు, రాంబలం, గోపవరం, గంగోలు వాసులు పదివేలమందికి పైగా రాగూర్ బల్క్ కెమికల్ పరిశ్రమతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఈ విషవాయువుల్లవల్ల ప్రజలకు అనేక అంటు రోగాలు, చర్మవ్యాధులు వస్తున్నాయని అన్నారు. దీనిపై నెల రోజుల ముందే జిల్లా పొల్యూషన్ అధికారిని కలిసి వివరించామని, ఆయన వైఖరి చూస్తుంటే రాగూర్ పరిశ్రమకు కొమ్ముకాస్తున్నట్లుగా ఉందని మధు తెలిపారు. దీనిపై పరిశ్రమ వద్ద, పొల్యూషన్ కార్యాలయం వద్ద త్వరలో ధర్నాలు చేపడతామని, వెంటనే ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా పరిశ్రమ యాజమాన్యం చూడాలని మధు కోరారు.

సంపదకు చెద

(1వ పేజీ తరువాయి)

ఆ టేకు కలప విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహ రించి మట్టిపాలు చేశారు. స్వాధీనం చేసుకున్న ఆ ఖరీదైన కలపను మొదట తహశీల్దార్ కార్యాలయం ముందు పెట్టడంతో ఆ కార్యాలయానికి వచ్చే జనం దానిపై చర్చించుకుంటున్నారని దానిని కార్యాలయం వెనుక వైపుకు తరలించారు.అటవీ శాఖ అధికారుల లెక్కల ప్రకారం సుమారు రూ.2 లక్షలు ఖరీదు చేసే ఆ కలపను నిరుపయోగంగా వదిలేయడంతో వానకు తడిసి, ఎండకు ఎండి చివరకు చెదపురుగులకు ఆహారంగా మారి మట్టిపాలైందని ప్రజలు విమర్శిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలోని ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్నట్లుగానే, ప్రభుత్వ ఖజానాకు ఆర్థిక లాభాలు చేకూర్చే కలపను కూడా ఇలా వదిలేయడమేంటని పలువురు దుయ్యబడు తున్నారు. పాలకులు మారారు.. ప్రజా ప్రతినిధులు మారారు... రెవెన్యూ సిబ్బంది కూడా మారారు... అయినా ప్రకృతికి నిలయమైన సంపద నిరుపయోగంగా మారడంతో సహజ సంపదనకు తూట్లు పొడిచి, ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని కొందరు మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

కోర్టు పరిధిలో ఉంది

తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న కలప కేసు కోర్టు పరిధిలో ఉందని, కోర్టులో కేసు పరిష్కారం కాని కారణంగా కలపపై ఉన్నతాధి కారులకు ఎటువంటి నివేదిక సమర్పించలేదని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. కోర్టు కేసు పరిష్కారమైన తర్వాత కలపపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ జిల్లా యంత్రాంగానికి నివేదిక పంపుతామని పేర్కొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి చేటు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం బాలుర వసతిగృహంలో చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ప్రధానోపాధ్యాయురాలు కె. ఎస్.వి.లోవాకుమారి ప్రారంభించి మాట్లాడుతూ ధూమపానం, గంజాయి సేవనం,మద్యపానం మానవాళికి చేటు చేస్తున్నాయని అవి ఆరోగ్యాన్ని కబళించడమే కాకుండా, మానవ సంబంధాల విచ్ఛిత్తికి దోహదం చేస్తున్నాయని అన్నారు. ధూమపానం, క్యాన్సర్ లు కవల పిల్లలని ఒకదాని వెంబడి ఒకటి వస్తాయని, ఆరోగ్యంగా ఉండాలంటే పొగాకు సేవనం, ధూమపానం ఆల్కహాల్ సేవించుట మొదలగు దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఏలూరు సార్వత్రిక ఆసుపత్రి నుండి వచ్చిన సైకాలజిస్ట్ కె సి హెచ్ వీరరాజు మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం వలన కలుగు నష్టాలను వివరిస్తూ వాటి వల్ల కుటుంబాలు ఆర్థికంగా ఎలా చితికి పోతున్నాయో ప్రాణ నష్టం జరుగుతుందో వివరించారు. సోషల్ వర్కర్ బాల మాట్లా డుతూ గుట్కా, పాన్ పరాగ్ లు చాలా ప్రమాదకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎం.విజయ ప్రకాష్,స్టాఫ్ సెక్రటరీ తల్లాడి జగదీష్ గణిత ఉపాధ్యాయులు ఎం.ఏ.నబీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

విశాలాంధ్ర- ఉండి : ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఉండి ప్రభుత్వ వైద్య అధికారి సాయి చంద్ర పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పాములపర్రు గ్రామ సచివాలయ కార్యాలయం వద్ద వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు.

వివిధ రుగ్మతలు, అనారోగ్య బాధితులు, శిబిరానికి భారీ ఎత్తున తరలివచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా బీపీ, షుగర్, గ్యాస్, తలనొప్పి, కడుపునొప్పి, నరాల హీనత, కీళ్ల నొప్పులు, వాపులు, వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి చంద్ర మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయకూడదని శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

కూటమికి వ్యతిరేకంగా పని చేస్తున్న కమిషనర్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ఏర్పడి 8నెలలు కావస్తున్నా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ కమిషనర్ ఆలోచన, పని విధానంలో మార్పు రాలేదని జనసేన పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కమిషనర్ మున్సిపాలిటీలో వైసీపీ మూలాలతోనే పని చేస్తున్నారని, కూటమి నాయకత్వం ప్రజా సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం పని చేయటం లేదని మేకా ఈశ్వరయ్య పేర్కొన్నారు. కూటమి కౌన్సిలర్ల పట్ల వివక్షతా పూర్వకంగా వ్యవహరిస్తున్నారని, వైసీపీ నాయకులు చెప్పినట్లే పాలన,నిధుల కేటాయింపులు చేస్తున్నారని, ఇటువంటి కమిషనర్ కూటమి ప్రభుత్వంలో అవసరమా అని ప్రశ్నించారు. కమిషనర్ వలన కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, ఇప్పటికైనా కమిషనర్ తన ప్రవర్తనను మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నేడు జనసేనసభకు తరలిరండి

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం: ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు జంగారెడ్డిగూడెం నుండి అధిక సంఖ్యలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు హాజరు కావాలని జనసేన పార్టీ ఏలూరు పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతల నాని పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ పీరు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ నాయకులు, మున్సిపాలిటీ నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ 14 వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక ఇందిరానగర్ కాలనీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం నుండి ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల శెట్టి రవి, బాధరాల నరేష్, కాసగాని రామారావు, ఉదర బాబి, మద్ది ప్రసాద్ అగస్త్య విజయ్ , వేణు తదితరు లు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్ బస్సు
- ప్రయాణికులు సురక్షితం

విశాలాంధ్ర - కుక్కునూరు: కుక్కునూరు - బూర్గంపాడు రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు నెలలుగా పనులు చేపట్టకపోవ దంతో వాహనాలు బోల్తా పడుతు న్నాయి. కుక్కునూరు మండలం లోని పాలవాగు సమీపంలో గురువారం ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు

అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతిన్నది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించు కున్నారు. ఘటనలో ప్రయాణికులంతా ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రోడ్డుపై రాళ్లు తేలి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా కాంట్రాక్టర్, అధికారులు దృష్టి సారించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పౌష్టికాహారం, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - తణుకు : అవయవాలను భద్రంగా ఉండేలంటే ఆహారపు అలవాట్లు, వ్యాయామం ఉండాలని మాజీ మునిసిపల్ చైర్మన్ వంక రాజకుమారి అన్నారు.ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా లయన్స్ 316 జి.వంక సత్యనారా యణ నాగమణి రినల్ డైలిసిస్ సెంటర్‌లో నిర్వహిం చిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మధుమేహం, అధిక రక్తపోటు నియంత్ర ణలో ఉండేలా చూసుకోవా

లని, పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా డాక్టర్‌తో సంప్రదించకుండా వేసుకో కూడదని రాజకుమారి చెప్పారు.ప్రభుత్వ ఆసుపత్రి లో నిరవహిస్తున్న దయాలసిస్ సెంటర్ లో అనేక మధ్య వయస్కులు, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంవల్ల రెండు కిడ్నీ లు దెబ్బతిని దయాలసిస్ చేయించు కుంటున్నారని అన్నారు. దయాలిసిస్ రోగులు,సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ రవిశంకర్ సూచనలు పాటించి, ఆరోగ్యాన్ని నిలకడగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ సెక్రటరీ మాదిరెడ్డి బాపూజీ రావ్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు.పైడిపర్రు-తేతలి క్లబ్ అధ్యక్షులు ప్రసన్న కుమార్, కుదారి సజని, ఆసుపత్రి డ్యూటీ డాక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

చలో పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ మహాసభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. గురువారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చలో పిఠాపురం పోస్టర్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో 14వ తేదీన జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ కార్యక్ర మానికి జయకేతనంగా నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు.

జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు ,కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, నాయకులు కృష్ణ ,వెంకటకృష్ణ, దుర్గారావు, నాని, సాంబ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - చింతలపూడి: మండల పరిధిలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి బీసీ, కాపు, ఈ.బీ.సీ. లబ్ధిదారులకు బీ.సీ. కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయడానికి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఎంపీడీవో ఎం. మురళీకృష్ణ పత్రిక ప్రకటనలో తెలియజేశారు.18 సంవత్సరాల నుండి 50 సంవత్సరముల వరకు వయసు కలిగి ఆసక్తి గల అభ్యర్థులు సమీప సచివాలయాలలో ఈనెల 22వ తేదీ వరకు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అన్నారు. రేషన్ కార్డు,ఆధార్ కార్డు, ఫోటో,ఫోన్ నెంబర్,కుల ధృవీకరణ పత్రాలతో ఆన్ లైన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు.

డ్రైయర్ ఫ్యాక్టరీల ముందు వాహనాల క్యూ

విశాలాంధ్ర-లింగపాలెం: సీడ్ మొక్కజొన్న పంట దిగుబడులు ఒకేసారి వస్తుండటంతో డ్రైయర్ ఫ్యాక్టరీలకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. మొక్కజొన్న పంటను తీసుకొచ్చే వాహనాలు ఫ్యాక్టరీల వద్ద క్యూ కడుతున్నాయి. పండిన సీడ్ మొక్కజొన్నను డ్రై చేయాల్సి ఉంది. దీనికోసం ఏలూరు జిల్లాలోని లింగపాలెం, పెదవేగి, చింతలపూడి మండలాల్లో డ్రైయర్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు.డ్రైయర్ బిన్ను సామర్థ్యం దాదాపు 50టన్నులు ఉంటుంది. ఒకసారి బిన్నులో వేసిన మొక్కజొన్న విత్తనాలు డ్రై అవటానికి ఐదు రోజులు సమయం పడుతుంది. అప్పటివరకు డ్రైయర్లలో విత్తనాలు వేసేందుకు అవకాశం ఉండదు. ఈఏడాది పంట దిగుబడులు అధికంగా ఉండటంతో పాటు ఒకేసారి పంట చేతికి రావడంతో ఫ్యాక్టరీలకు డిమాండ్ ఏర్పడింది. మన రాష్ట్రంలో ఏలూరు జిల్లాలోనే డ్రైయర్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉన్నాయి. ఏపీలో ఏ ప్రాంతంలో సీడ్ మొక్కజొన్న పండినా ఏలూరు జిల్లాలోని ఫ్యాక్టరీలకే తరలిస్తున్నారు. దీంతోపాటు తెలంగాణ రాష్ట్రంలో పండించిన పంటను కూడా ఏలూరు జిల్లా ఫ్యాక్టరీలకే వస్తుంది. దీంతో ఫ్యాక్టరీల ముందు పెద్ద సంఖ్యలో మొక్కజొన్న లోడుతో వచ్చిన వాహనాలు

నిలిచిపోయి ఉన్నాయి. వాహనాల్లో ఉన్న మొక్కజొన్న పంటను దింపుకోవటానికి నాలుగైదు రోజుల సమయం పడుతుంది. దీంతో వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీల యాజమాన్యాలు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఫ్యాక్టరీలన్నీ ఊరికి దూరంగా ఉండటంతో కనీస అవసరాలు అందుబాటులో లేక డ్రైవర్లు, వాహనాలలో ఉన్న ఇతర సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలలో ఉన్న సరుకును దించేసుకుని తమను పంపించి చేయాలని వాహనాల డ్రైవర్లు కోరుతున్నారు. అయితే వాహనాలలో నుంచి మొక్కజొన్నలను దింపితే వ్యయ ప్రయాసలు అవుతాయని ఫ్యాక్టరీల యజమానులు అంటున్నారు. దీనివల్ల డ్రై చేయటం మరింత జాప్యం అవుతుందని అంటున్నారు.ఈ ఏడాది ఎదురైనా అనుభవా లను పరిగణలోకి తీసుకొని భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని రైతులు ఫ్యాక్టరీల యజమానులను కోరుతున్నారు.

కమ్మేస్తున్న మంచు

వాతావరణ పరిస్థితులపై ఆందోళన

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్టప్రాంతమైన లింగపాలెం మండలంలో రెండు రోజులుగా మంచు ప్రభావం తీవ్రంగా ఉంది. మంచు కమ్మేస్తుండటంతో జనజీవనం స్తంభిస్తున్నది. దీంతోపాటు మామిడి,జీడి మామిడి రైతులు ఆందోళన చెందు తున్నారు. మెట్ట ప్రాంతంలో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మార్చి నెలలో మంచు ప్రభావం అంతగా ఉండదు. ఈ ఏడాది దీనికి భిన్నంగా ఉంది. ఉదయం మంచు పడుతుండటం, మధ్యాహ్నానికల్లా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులుచోటు చేసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 17 నుంచి10వతరగతి పబ్లిక్ పరీక్షల మొదలు కాబోతున్నాయి. విద్యార్థులపై ఎండ ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులలో ఆందోళన చెందుతున్నారు. మూడు గంటల సమయం పరీక్షహాలులో ఉండాలి.పరీక్ష పూర్తవ్వగానే ఎండలోనే విద్యార్థులు ఇంటికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణ పరిస్థితులు విద్యార్థులపై ప్రభావం చూపే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉండటంవల్ల జీడి, మామిడి తోటలపై ప్రతికూల ప్రభావం పడుతుందని రైతులలో ఆందోళన నెలకొంది. ఈఏడాది పూత,దిగుబడులు లేక మామిడి,జీడి మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు తీవ్రంగా మంచు పడటం,ఆ తరువాత అధిక ఉష్ణోగ్రతలు వేయడంతో పంటలపై ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని ఏ పోలవరం పంచాయతీ పరిధిలో ఆ గ్రామం నుంచి పక్క గ్రామమైన చిన్నవారి గూడెం వైపుగా వచ్చే ప్రధాన రహదారికి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి నేలకు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కు ఉన్న మూడు వైర్లు కిందకు ఉన్నాయి. చేతికి అందేలా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. అదే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఇరువైపులా కొబ్బరి ఆకులు, ఎండు తుక్కు ఎక్కువగా ఆనుకుని ఉంది. అసలే వేసవి ఎండలు ముదిరిపోతున్నాయి. ఏ మాత్రం విద్యుత్ వైరు ఆకులకు తగిలినా ప్రమాదం చోటు చేసుకొనే వాతావరణం నెలకొంది. అదే జరిగితే

చుట్టు పక్కల గేదెలు, పాకలు, గడ్డివాములు, పామాయిల్ పొలాలు ఉన్నాయి. ఆ రోడ్డుకు మలుపు తిరిగే దగ్గర రోడ్డుకు ఆనుకుని ఉండటంతో ఆ రోడ్డులో ప్రయా ణించే వాహనదారులకు, ట్రాక్టర్లకు ఇబ్బంది కరంగా మారింది. ప్రమాదం జరగక ముందే ముందస్తు చర్యలు చేపట్టి, విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి వెళ్లేలా ఏర్పాటు చేసి, చుట్టూ శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

పశ్చిమలో ఆధునికీకరణ పనులు చేపట్టండి

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: పశ్చిమ గోదావరి జిల్లాలో డ్రెయిన్స్ బాగు చేయవలసిన అవసరం ఎంతో ఉందని తక్షణం ఆధునికీకరణ చేపట్టి కాలువలకు మరమ్మతులు నిర్వహించాలని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమ యంలో వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ డ్రెయిన్స్ పూడి పోవడం వల్ల వర్షం నీరు చేలలోనుండి బయటకు వెళ్ళలేక చేలోనే నీరు నిల్వ ఉండి,

పంటలు వేసుకొనే పరిస్థితి లేదన్నారు.ప్రధానంగా తణుకు మండలంలో తేతలి నుండి మండపాక డ్రైన్ వరకు ఉన్న డ్రైన్ కొన్ని చోట్ల ఆక్రమణలకు గురై కొన్ని చోట్ల వెడల్పు బాగా తగ్గి నీరు నిలిచి పోతుందన్నారు. దీని మూలంగా తేతలిలో 200 ఎకరాలు సేద్యానికి ఉపయోగపడకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో డ్రైన్ వెడల్పు చేసి,ఆక్రమణలు తొలగిస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.జిల్లాలో ఉన్న యనమ దుర్రు డ్రైన్,నక్కల కాల్వ,ఇతర డ్రైన్ లను కూడా వెంటనే మరమ్మతులు చేస్తే వచ్చే పంటలను రైతులు సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. మురుగు నీరు నిల్వ మూలంగా దోమలు పెరిగి వ్యాధుల వ్యాప్తిని కూడా అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి మనిషి కిడ్నీల విషయంలో జాగ్రత్తలు పాటించి కిడ్నీల వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని పి.ఎం.పి అసోసియేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఏ ఆర్ కె పరమేశ్వర్లు అన్నారు. గురువారం గణపవరం కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పి

.ఎం .పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం గణపవరం మండలం పి హెచ్ పి అధ్యక్షులు మండా సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సరిపల్లి కామాక్షి క్లినిక్‌లో నిర్వహించారు. పిహెచ్‌పి మండల అధ్యక్షులు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మూత్రపిండాల ఆరోగ్యం, ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిఎంపి కోశాధికారి కె.అప్పారావు, సహాయ కార్యదర్శి కెటివిఎన్ సత్యనారాయణ (నాని), మస్తాన్ వల్లి, పానకాలు, సభ్యులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బోరుకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో రాజవరం గ్రామ ఎస్.సి. శ్మశాన వాటికలో మంచినీటి బోరు నిర్మాణానికి గురువారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన థెరిస్సా మహిళా మండలి ఆధ్వర్యంలో కాకర్లమూడి భాస్కరరావు, రాము లమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల

సౌజన్యంతో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాకర్లమూడి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో మంచినీరు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా లక్ష రూపాయల సొంత ఖర్చులతో మంచినీటి బోరును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ తుక్కయ్య మాట్లాడుతూ శ్మశాన వాటికలో మంచినీరు బోరు నిర్మించడానికి దాతలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్య దర్శి రామచంద్రరావు, అచ్యుత్, కొదారి వెంకటు, కాకర్లమూడి రాజుపాల్, ఆనంద భాస్కర్, విజయ భాస్కర్, సోమరాజు, తమిర్చి వీర్రాజు, సురేష్, కొదారి వంశీ, భీమదోలు చిన్న దుర్గారావు, దానియేలు, సుబ్బారావు పాల్గొన్నారు.

పని భారం తగ్గించండి

ప్రభుత్వానికి పంచాయతీ కార్యదర్శుల వినతి

విశాలాంధ్ర - పాలకొల్లు: పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని, సర్వేల పేరుతో తమకు పని ఒత్తిడి మరింత ఎక్కువ ఉందని పాలకొల్లు మండల పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు పని భారం తగ్గించాలని, పని ఒత్తిడి పెంచవద్దని కోరుతూ బుధవారం పాలకొల్లు మండల అభివృద్ధి అధికారి ఉమామహేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ, పూలపల్లి పంచాయతీ కార్యదర్శి పాల శ్రీను, చింతపర్రు పంచాయతీ కార్యదర్శి శివ రామకృష్ణ, లంకలకోడేరు పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, భగ్గేశ్వరం పంచాయతీ కార్యదర్శి, సగం చెరువు పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఆగర్రు పంచాయతీ కార్యదర్శి సుంకర గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: గ్రామపంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని కోరుతూ మండల కార్యదర్శి అసోసియేషన్ తరపున గురువారం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆర్.కుమారస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం 13 రకాల సర్వేలు చేస్తున్నట్టు తెలిపారు. సర్వేలతోపాటు ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయడంలో ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఇంకా 26 రకాల సర్వేలు చేయాలని ఒత్తిడి చేయడం వల్ల విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు మానసికంగా శారీరకంగా అలసిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సర్వేలను తగ్గించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సంఘం అధ్యక్షులు కుమార్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాణి, వసంత ప్రసాద్, ఇతర కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉండి : పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించి ఒత్తిడికి గురికాకుండా పంచాయతీరాజ్ చట్టంలో ఉన్న పనులు చేయించు కునే విధంగా వెసులుబాటు కల్పిం చాలని మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విస్తరణ అధికారి వెంకటరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శుల సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు జేవీటి నాయుడు, కేశిరెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ సర్వేల పేరుతో రోజురోజుకి పని భారం పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలతో క్షణం తీరిక లేక పని ఒత్తిడికి గురవుతున్నామని పేర్కొన్నారు. కార్యదర్శుల పరిధిలో ఉన్న పనులను మాత్రమే చేయించుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫైలేరియా పట్ల అప్రమత్తంగా వుండాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రజలు ఫైలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా వుండాలని వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఫణీంద్ర బాబు తెలిపారు. జాతీయ ఫైలేరియా (బోదకాలు) వ్యాధి కార్యక్రమంలో భాగంగా టి.నరసా పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాలుగు సచివాలయాలలో గల ఐదు ఫైలేరియా కేసులకు మందులు, మెటీరియల్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా (బోదకాలు)వ్యాధి క్యూలెక్స్ దోమ కుట్టడం వలన వ్యాప్తి చెందుతుందని తెలిపారు. క్యూలెక్స్ దోమ ఇంటి పరిసరాల్లోని మురుగు నీటిలో నిల్వ వుంటుందని, రాత్రి వేళల్లో మనిషి నిద్రపోయిన తరువాత క్యూలెక్స్ దోమ కుడుతుందని పేర్కొన్నారు. వ్యాధి తీవ్రత పెరగకుండా రోజుకు మూడు మాత్రలు చొప్పున 12 రోజుల కోర్స్ ఆరు నెలలు పాటు వాడాలని ఆయన తెలిపారు. ఈ మాత్రలతో పాటు రెండు ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్లు పి.మావుళ్ళమ్మ, ఎండిఎఎస్ బేగ్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీని సందర్శించిన పోలవరం ప్రాజెక్ట్ పరిశీలన అధికారి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : జూన్, 2025 గోదావరి వరదలు సంభవించేలోగా ముంపు గ్రామాలలో ఉన్న నిర్వాసితులకు పునరావాసం, పునరాశ్రయం కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో తగు చర్య తీసుకోవాలని పోలవరం ప్రాజెక్ట్ పరిశీలన అధికారి అభిషేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పోలవరం మండలం ఎల్ఎన్డి పేట పునరావాస కాలనీని సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ముంపు మండలాలు అయిన పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు గ్రామాలకు సంబంధించిన నిర్వాసితులకు పునరావాస, పునరాశ్రయం సంబంధించి ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ., కే.ఆర్.పురం, జంగారెడ్డిగూడెం ఆర్.డి.ఓ. ట్రైబల్ వెల్ఫేర్, హౌసింగ్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ, ఇఇలు, డిఇలు లతో పోలవరం, బుట్టాయగూడెం,జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల తహశీల్దార్లు, ఆర్ అండ్ ఆర్ సిబ్బందితో ప్రాజెక్ట్ ఆఫీసర్, కే.ఆర్.పురం ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో ముంపునకు గురయ్యే 15 హేబిటేషన్లకు ఆర్ అండ్ ఆర్ స్కీం కు సంబంధించి, ఈనెల 20వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఏ పివో కె. రాములు నాయక్, జంగారెడ్డిగూడెం ఎం.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల మధ్య పోరు... అధికారులకు సంకటం

విశాలాంధ్ర-చాట్రాయి: చాట్రాయి తహసీల్దార్ డి.ప్రశాంతి సస్పెన్షన్ పై పలు విధాలుగా చర్చలు సాగుతున్నాయి. కొబ్బరి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డికి అన్నచందంగా సస్పెండ్ చేసిన విధానం అద్దం పడుతుందని పలువురు అంటున్నారు. తహసీల్దారు సస్పెన్షన్లకు ప్రధాన కారణాలు జనార్ధనవరం గ్రామంలో ఆర్ఎస్ఆర్ అడంగల్ ఆధారంగా 103/2లో ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి అరఎకరం చొప్పున తహశీల్దారు పాస్‌బుక్ మంజూరు చేసారు. వాగు పోరంబోకు భూమికి పాస్ బుక్ ఇచ్చారంటూ పర్వతాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు వాగు పోరంబోకు పట్టా ఇచ్చారంటూ ప్రజా దర్బార్ లోను, సీఎంకు ఫిర్యాదు చేయగా అదే ప్రధాన కారణంగానే సస్పెండ్ చేశారనేది ఒక వాదన .అదే భూమి రోడ్డు భూమి అని వీఆర్వో చెబుతుండగా వాగు అంటూ సబ్ కలెక్టర్ నివేదికలో వున్నట్లు తెలుస్తోంది. అదే ఫిర్యాదుపై చాట్రాయి మండల రెవెన్యూ కార్యాలయంలో సబ్ కలెక్టర్ చేసిన విచారణకు ఫిర్యాదుదారుడు హాజరైన దాఖలాలు లేవు. భూమి మీదకు వెళ్లి ప్రత్యక్ష పరిశీలన చేసిన దాఖలాలు లేవు. 102 నెంబర్లలో ఉన్న వాగు భూమికి 103/2 గా ఎలా నిర్ధారణకు వచ్చారు అనేది అర్థం కాని పరిస్థితి. సోమవారం గ్రామంలోని 355/4లోని 15 ఎకరాల 76 సెంట్లు భూమికి అటవీ శాఖ అధికారుల క్లియరెన్స్ ఆధారంగా ,అడంగల్, ఆర్ఎస్సార్ల ఆధారంగా పాసుబుక్ మంజూరు చేయగా దాని పై కూడా ఫిర్యాదు చేశారు. సోమవారంలో కోర్టు వివాదంలో ఉన్న మరో ఏడు ఎకరాల భూమి పై ఇచ్చిన పాసుబుక్కులు గురించే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆర్ఎస్ఆర్ అడంగల్ లేనటువంటి ఏ ఒక్క భూమికి తహసీల్దార్ పాస్‌బుక్కు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు ప్రచారం జరగడం హాస్యాస్పదంగా ఉందని పలువురు అంటున్నారు. అటవీ భూమి యజమానులకు అవసరమైన విధంగా తహసీల్దార్ నివేదికలు ఇవ్వనందువలనే అసలు సమస్య ప్రారంభమైందని పలువురు అంటున్నారు. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్నప్పుడు సాక్షాత్తు తహసీల్దార్ షాకీరున్నిసా బేగం ముందే ఆన్లైన్లో చేర్పులు మార్పులు పై గొడవలు పెట్టుకుని చొక్కాలు పట్టుకుని కొట్టుకొని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసులు పెట్టుకున్న సందర్భాలు లేకపోలేదు. అధికార పార్టీ నాయకుల మధ్య పోరు అధికారుల పాలిటశాపంగా మారుతుందని పలువురు అంటున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గత వారం రోజుల క్రితం విశాలాంధ్ర పత్రికలో వెలువడిన తాగునీటి సమస్యను పరిష్కరించాలి కథనానికి అధికారులు స్పందించారు. మండలంలో గవరవరం గ్రామ పంచాయతీ పరిధి వెంకయ్యపాలెం గ్రామ శివారులో ఉన్న కాలనీలో మంచినీటి కొరత ఎక్కువగా ఉండడంతో సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఆధ్వర్యంలో కాలనీ వాసులతో ఖాళీ బిందెలతో చేపట్టిన నిరసనకు స్పందన లభించింది. లక్ష్మి టైలర్ కర్రి శ్రీనివాసరావు లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో ఆయన కుమారుడు కార్తీక్ జ్ఞాపకార్థం మంచినీటి ట్యాంకులను నిర్మించారు. వాటర్ ట్యాంకులకు సత్యసాయి మంచినీటిని అందించి, కాలనీ వాసులకు మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. నేడు మంచినీటి ట్యాంకులను పరింపుడి గ్రామపంచాయతీ సర్పంచ్ విజయ కుమారి చేతుల మీదుగా ప్రారంభించినట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు రహదారి భద్రత అవసరం : డీటీసీ కరీం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రహదారి భద్రత పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పిలుపునిచ్చారు. గురువారం వట్లూరులోని రామచంద్ర ఇంజి నీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ పి.రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత, నియమ నిబంధనలపై ప్రతి విద్యార్థి అవగహన పెంచుకోవడం ద్వారా ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించ వచ్చునని అన్నారు.

రాష్ డ్రైవింగ్ వల్ల జరిగిన ప్రమాదాలను కొన్ని ఉదాహరణలతో రమేష్ బాబు విద్యార్థులకు వివరించారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. రహదారి నియమ నిభంధనలు పాటించకపోవడం వల్ల వాహన చోదకులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, వాహన తనిఖీ అధికారి పి.నరేంద్ర బాబు పాల్గొన్నారు.

TADEPALLIGUDEM MUNICIPALITY

E-PROCUREMENT TENDER NOTICE

Roc.No.2422/E1/2023-24 Dated : 13-03-2025

Sl No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	HDPE Water Supply Pipelines, Chalivendrams, Cross Bund, Valve Pits & Central Lightings Works works-12 Nos 12	General Funds	42.76	15-03-2025	01-04-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner,
Tadepalligudem Municipality

గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : గ్రామాలలో సమస్యలు పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు బాధ్యతగా పనిచేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని దేవరపల్లి ఎంపీపీ దుర్గారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీరాజ్ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కెవికె దుర్గారావు మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను ప్రజాప్రతినిధులు క్షుణ్ణంగా తెలుసుకుని అధికారులను తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని దుర్గారావు తెలిపారు. యువోపీఆర్డీ బి రాజారావు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు పరిసర పరిశుభ్రతపై వివిధ అంశాలపై సర్పంచులు ఎంపీటీసీలు దృష్టి పెట్టాలన్నారు. మండల పరిషత్ సూపరిండెంట్ జి శాంతి ట్రైని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీర కుమారి కో ఆప్షన్ నెంబర్ అస్మత్ ఉన్నిసా, ఎంపిటిసిలు నూతలపాటి చంద్ర కామిశెట్టి శిరోమణి, జేష్ట సునీత ,బొంత చినబాబు, సుంకవెల్లి చిన్న నాగ వెంకట దుర్గా తమ్మిరెడ్డి నాగలక్ష్మి, గ్రామ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు

ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో గురువారం కాకినాడ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై చైతన్య మురళి వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైతన్య మురళి విలేకరులతో మాట్లాడుతూ దేవరపల్లి సర్కిల్ కార్యాలయంలో 2 9 4 కేసులు నమోదు చేశారని,వాటిలో 100 కేసులు బెల్టు షాపులు పైన నమోదు చేసినట్టు తెలిపారు. తమ పరిధిలో 20 సర్కిల్ కార్యాలయం, 455 షాపులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో ఫైల్లు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్కిల్ సీఐ శ్రీనివాసరావు సర్కిల్ పరిధిలో తాము చేస్తున్న కార్యక్రమాలు వివరించారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలం ఎర్నగూడెంలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. శ్యామ్ గోపాల్ కిరణ్ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు జరిగాయి. నూలు వెంకట శ్రీనివాస్ తయారు దంపతులు కంచర్ల శ్రీనివాస్ కనకదుర్గ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం రోహిణి దంపతులు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం కాశీ విశ్వనాథం మాట్లాడుతూ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట లు జరిగి సంవత్సరం పూర్తయిందని ఈ సందర్భంగా వార్షికోత్సవాలు నిర్వహి స్తున్నామని తెలిపారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆలమూరు : సామాన్యులకు అర్థమయ్యే రీతిలో అచ్చ తెలుగు నుడికారంతో రామాయణాన్ని రచించి ప్రజలకు అందజేసిన కవయిత్రి మొల్లమాంబ గొప్ప దార్శనికురాలని ఆలమూరు మండల శాలివాహన సంఘం అధ్యక్షులు మల్లవరపు మల్లేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఆమె కుమ్మరుల ఆడపడుచు కావడం తమ అదృష్టం అన్నారు. ఆలమూరులో గురువారం మండల శాలివాహన సంఘం అధ్యక్షతన మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు వంటిపల్లి పాపారావు, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబులతో పాటు పలువురు హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణాన్ని సరళంగా రచించి శ్రీకృష్ణదేవరాయల మన్ననలు పొందిన కవయిత్రి మొల్ల జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్, పెన్నులు, పరీక్షల అట్టలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రామానుజుల శేషయ్య, గంగుల వీరబాబు, కడియాల శ్రీను, ఈదర రాంబాబు, గంగుల రామ్ కుమార్, వైవివి రమణ, మండల శాలివాహన సంఘ గౌరవ అధ్యక్షుడు పేరూరి త్రిమూర్తులు, జిల్లా సహాయ కార్యదర్శి అంబటి వీరబాబు, పసలపూడి

ఎంఆర్ పాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

విశాలాంధ్ర - కడియం : సాగుబడిలో నున్న దాళ్వా వరి పంట ఆరోగ్యం గానే ఉందనీ, ఈనిక దశలో ఉన్నదనీ, కాండం తొలిచే పురుగు అక్కడక్కడ కనిపిస్తుందనీ, నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తెలియజేసారు. బుధవారం కడియం మండలం మాధవరాయుడు పాలెం గ్రామంలో ఏడిఏ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి ద్వారకా దేవి సమక్షంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, అభ్యుదయ రైతు, గ్రామ పెద్ద అన్నందేవుల వీర వెంకట సత్య నారాయణ (చంటి) పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు మాట్లాడుతూ, దాళ్వా వరి పంట మండలంలో పాలు పోసుకొనే దశలో ఉందని, పంటలో బీడపీడలు తక్కువగా ఆశించాయన్నారు. ప్రకృతి వ్యవసాయం డైరెక్టర్ తాతారావు కాషాయం తయారీ విధానం వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో రబీ వరికి మచ్చ తెగులు ఆశించి, పైరు పసుపు రంగుకి మారిందన్నారు. నివారణకు జినేబ్ గ్ర(-78) 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ ఎస్ జయరామలక్ష్మి, ఏడిఏ శ్రీనివాస్ రెడ్డి, రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు మరిడి వీరభద్రరావు, పాతూరి వెంకటేశ్వరరావు, ఎన్ఎఫ్ గౌతమ్, ఎల్ టు ప్రసాద్, ఐసిఆర్పి లు రత్నబాబు, దుర్గాప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ విజయవంతం కావాలని కోరుతూ దేవర పల్లి గ్రామ దేవత కడియాలమ్మ ఆలయంలో గురువారం గోపాలపురం నియోజక వర్గ జనసేన పార్టీ ఇన్చార్జి డి సువర్ణ రాజు ఆధ్వ ర్యంలో జనసేన నేతలు వీర మహిళలు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విష్ణుభట్ల రామారావు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి జనసేన నేతలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణరాజు మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గం లో చిత్రాడ గ్రామంలో 14 తేదీ శుక్రవారం జనసేన పార్టీ ప్లీనరీ సమా వేశం జరుగుతుందని, ఈ సమావేశంలో జనసేన పార్టీ వ్యవస్థాపకు అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు. ఈ ప్లీనరీ సమావేశంలో జనసేన పార్టీ అనేక కీలక నిర్ణయాలు ప్రకటి స్తుందని, గోపాలపురం నియోజకవర్గం నుండి 8 బస్సులు మోటార్ సైకిల్ చిన్నకారులతో జనసేన పార్టీ నేతలు కార్యకర్తలు చిత్రాడ సభకు తరలి వెళ్తారని తెలిపారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు జనసేన నేతలు వీర మహిళలు కడియాలమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు దాసరి శేషారావు , మాధవరపు వెంకటేశ్వర్రావు, పసుపు లేటి శివనాగ ప్రసాద్, సూరిశెట్టి బాలు , దుగ్గిన గంగాధరరావు జాజిమొగ్గల శ్రీనివాసరావు, కవల సీతారత్న , సూర్యకుమారి , అడబాల మణికంఠ, సిద్దా తాతబ్బాయి, కంబాల సత్తిబాబు, మొహిద్దిన్ నరసింహమూర్తి జనసేన నేతలు, మహిళలు పాల్గొన్నారు

ప్రతిభావంతులకు ఐఎంఏ ఉచిత విద్య

విశాలాంధ్ర - అనపర్తి : విద్య వ్యాపారం గా మారుతున్న నేటి తరుణంలో ఎంతోమంది ప్రతిభావంతులు ఆర్థిక కారణాల దృష్ట్యా నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారనే ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది 65 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు జిబిఆర్ విద్యాసంస్థల ద్వారా ఐఎంఏ అనపర్తి శాఖ ఉచిత విద్యను అందించడం జరు గుతుందని ఆశాఖ అధ్యక్షులు, ప్రముఖ షుగర్ వైద్యులు తాడి రామగుర్రెడ్డి తెలిపారు. గురువారం అనపర్తి ఐఎంఏ, జిబిఆర్ ఉచిత విద్యా పథకం కర పత్రం 2025 డాక్టర్ గుర్రెడ్డి, ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. ఉచిత విద్యకు సంబంధించి అర్హుల ఎంపిక ఐఎంఏ అనపర్తి శాఖ పూర్తి పారదర్శకతతో నిర్వహించి అర్హుల జాబితా ప్రకటించడం జరుగు తుందని గుర్రెడ్డి తెలిపారు. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి (ఇంగ్లీష్ మీడియం) విద్యార్థులకు అర్హత పరీక్ష ద్వారా ఎంపికలు జరుగుతాయని, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థుల ఎంపిక లాటరీ పద్ధతిలో జరుగుతాయని ఆయన చెప్పారు. అర్హత పరీక్ష ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించడం జరుగుతుందని ఈ పరీక్షకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని డాక్టర్ రామ గుర్రెడ్డి తెలిపారు.

ప్రగతి ఇంజనీరింగ్‌లో వర్క్ షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం తరపున ఐఇటిఇ స్టూడెంట్ చాప్టర్ సౌజన్యంతో గురువారం యాంటెన (తరంగ గ్రాహకం) రూపకల్పన, అనువర్తనాలు" అనే ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించబడిందని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పి కృష్ణారావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి నరేష్ ఈ కార్యక్రమానికి విచ్చేసిన వనరు వ్యక్తి, యూనివర్సిటీ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ జెఎన్టి యుకె కాకినాడ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలిశెట్టి రమా దేవికి సాదర స్వాగతం పలికారు. రమాదేవి మాట్లా డుతూ విద్యుత్ సంకేతాలను విద్యుదయస్కాంత తరంగా లుగా మార్చడం ద్వారా యాంటెనాలు పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బివిఎన్ శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ జివిఎస్ శివకుమార్, మేనేజ్మెంట్ డైరెక్టర్ ఎంవి హరనాధ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరెక్టర్ అకాడెమిక్స్ డాక్టర్ కె సత్య నారాయణ, విద్యార్థి సమన్వయకర్తలు, ఐసిఇ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్ కుమార్‌కు సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : ముమ్మిడివరం పల్లిపాలెం సెంటర్లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ నివాసంలో గురువారం ఛైర్మన్ పెదపూడి విజయ్ కుమార్ విచ్చేశారు. విజయ్ కుమార్‌కి చెల్లి శాంతి అశోక్ దంపతులు ఆయనను సన్మానించారు. అలాగే తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఆయనకు పూలగుచ్చెలతో అభినంద నలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో నగర్ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి గోపి, నియోజకవర్గ క్రిస్టియన్స్ సెల్ అధ్యక్షులు కాశి లాజర్, మోర్త ప్రసాద్, నీతిపూడి వంశీ, బూరుగు కళ్యాణ్, దాగే సత్తిబాబు, దేవరపల్లి ప్రసాద్,శేఖర్, చౌదరి, జాగు సత్తిబాబు, గంటి రాజేష్, కాశి అరుణ్, మొదలగు వారు పాల్గొన్నారు.

హోలీ వేడుకలు ఆనందంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - కడియం : చిన్నారులు , స్నేహితులు, పెద్దలు రంగులను చల్లుకుంటూ ఒకరికి ఒకరు తమ స్వచ్ఛమైన మనస్సుతో ఆనంద తన్మయత్వం చెం దుతూ చిరునవ్వులను చిందిస్తూ శుక్రవారం జరిగే రంగేలిని ఎంతో ఉత్సాహంగా కేరింతల నడుమ ఆనందంగా జరుపుకోవాలని కడియం మండల బీజేపీ అధ్యక్షులు బొర్సు సుబ్రహ్మణ్యం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పండుగను కాముని దహనం అని కూడా అంటారని, హోలి పండుగ దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగలలో ఇది ఒకటని పేర్కొన్నారు. హిందూ పురా ణాల ప్రకారం హోలి అనగా అగ్నితో పునీతమైనదని, మనలోని చెడు కోరికలను దహింపచేసుకొని, సమాజ హితాన్ని కోరుతూ మతసామరస్యాన్ని పెంపొందింప జేసుకోవాలన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - సామర్ల కోట : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సామర్లకోటలో గురువారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర కిట్లు పంపిణీ చేశారు. కడప జిల్లా పులివెందులలో జరగనున్న 34 సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి నిమ్మకాయల కిరణ్, కొండపల్లి శ్రీనివాసరావు, కోచ్ మురళి కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రకృతి వ్యవసాయ పంట తినడం ఆరోగ్యకరమని రసాయనిక ఎరువుల ద్వారా పండించిన పంట తినకూడదని జగ్గంపేట ఐసిడిఎస్ అధికారి సిడిపిఓ పూర్ణిమ అన్నారు. పోషణ వాటిక ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయలను గురువారం గండే పల్లి మండలం తాళ్లూరు వన్ సెంటర్‌లోని అంగన్వాడి కేంద్రంలో అంగనవాడి కార్యకర్త వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సిడిపిఓ పూర్ణిమ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు సంవత్సరముల నుండి ఆరు సంవత్సరముల లోపు పిల్లలకు గర్భవతులకు, బాలింతలకు పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తున్నారని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామ నాయకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మునగాకు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తల్లి పాలు పెరగడమే కాకుండా తల్లికి బిడ్డకు కూడా పౌష్టికరమైన ఆహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా కే సత్యవతి, గర్భవతులు, బాలింతలు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - కడియం : నలభై మూడు సంవత్సరాల క్రితం రాజమండ్రి జెఎన్ఎమ్ కళాశాలలో ఐటిఐ చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం కడియం మండలం బుర్రిలంక గ్రామంలోని ఓ నర్సరీలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వివిధ రాష్ట్రాలలో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటున్న వీరు ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్ గా ఎంపికైన పూర్వ విద్యార్థి తాడాల కొండరాజును వీరు అభినందించి సత్కరించారు. ఈ ఆత్మీయ కలయికలో ఐ సత్యనారాయణ (పాలకొల్లు), కె సత్య నారాయణ (జగ్గంపేట), ఎం సూరిబాబు (ఏలేశ్వరం), డివి రామయ్య (కడియం), డి అశోక్ కుమార్ (విశాఖపట్నం), పి సత్యనారాయణ (ధవళేశ్వరం), వైడి సత్యనారాయణ (హైదరాబాద్), పి రామకృష్ణ (హైద్రాబాద్), టి సాంబశివరావు (ధవళేశ్వరం), టి కృష్ణ (ధవళేశ్వరం), జె నాగేశ్వరరావు (ధవళేశ్వరం), జివి రామకృష్ణ (విజయవాడ) తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య సేవలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఆలమూరు : పాడి రైతులు ఉచిత పశు వైద్య సేవలు వినియోగించుకోవాలని మండపేట ఎస్ఏహెచ్‌సి డిప్యూటీ డైరెక్టర్ గణపతిరావు, ఆలమూరు ఏడి డా ఎల్ అనిత, మండపేట ఏడి డా ఎస్ ప్రశాంతి అన్నారు. మండలంలోని మడికి శివారు చిలకలపాడు వినాయకుని గుడి సమీపంలో మండపేట ఎస్ఏహెచ్‌సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య ఆరోగ్య రక్షణ శిబిరాన్ని గురువారం వారు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా పశుసంతతి పురోభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ పశు వైద్య శిబిరంలో సుమారు 100 పశువులకు వైద్యులు ప్రత్యేక పరీ క్షలు చేశారని తెలిపారు. ఇందులో భాగంగా మండపేట నుంచి15 మంది ట్రైనీ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యకమంలో కూటమి నాయకులు దొండపాటి సుబ్బరాజు, కొత్తపల్లి నగేష్, కొత్తపల్లి కృష్ణ, ఈదల రమేష్, పాలూరి బుల్లబ్బాయి, పశు వైద్యులు డాక్టర్ డి వినోద్ కుమార్, డాక్టర్ జి భాను ప్రసాద్, మండపేట పశు వైద్యులు డాక్టర్ ఏజివిఎస్ ప్రసాద్, పాల్గొన్నారు.

అన్నదాతల సమస్యలపై ఎమ్మెల్యే బండారు గళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : వారం రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరుగుచున్న నేపథ్యంలో అన్నదాతల సమస్యలపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గళమెత్తారు. కొత్తపేట నియోజకవర్గం సెంట్రల్ డెల్టాలో గల లొల్ల, ర్యాలీ లాకులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించారని, సుమారు 137 ఏళ్ల పాటు రెండు లాకులు తమ సేవలను అందిస్తూ వచ్చాయని, అవి శిథిలావస్థకు చేరడంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని, అలాగే ఈ లాకుల పైనుండి రాష్ట్ర స్థాయి రహదారి ఉందని, కోనసీమ జిల్లాలో ఐదు నియోజకవర్గాల రైతులకు ఈ లాకులు ద్వారానే సాగినీరు అందుతుందని, ఈ లాకులు పునర్నిర్మాణ వల్ల అయిదు నియోజకవర్గాలలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యపై గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జల వనరుల శాఖ మంత్రి స్పందించి నిధులు మంజూరు అయ్యేలా కృషిచేయాలని గౌరవ సభ ద్వారా ఎమ్మెల్యే బండారు విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సిఎం సహాయనిధి చెక్కులను ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యానికి ఆర్థిక స్తోమత లేని బాధితులు సాయం కోసం అర్థించగా, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సిఫార్సులతో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. ఆ చెక్కులను 27 మందికి 25 లక్షల 22 వేల 204 రూపాయల చెక్కులను నవీన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి మండలాలకు సంబంధించి 27 మందికి రూపాయలు చెక్కులను బాధితులకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో భూపాల పట్నం సర్పంచ్ వీరంరెడ్డి, కాశిబాబు టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు,, ఉంగరాల రాము, నీలం శ్రీను, దేవరపల్లి మూర్తి, రేఖ బుల్లి రాజు, వేములకొండ జోగారావు, బద్ది సురేష్, కోడూరి సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజీ, ముత్యాల సత్యనారాయణ, సూరిశెట్టి వెంకట శివ, బీసెట్టి సూరిబాబు, కాకిలేటి రాయుడు, బాలకృష్ణ, ఆ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కేవలం వారి హాల్ టికెట్ ఆధారంగా ఏ విధమైన బస్సు పాసు లేకపోయినా కూడా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులలో ఈ నెల 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు ఉన్న రోజులలో ఈ ఉచిత ప్రయాణం చేయవచ్చునని ఆయన తెలిపారు. కోనసీమ జిల్లా పరిధిలోని విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు తెలిపారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల

విశాలాంధ్ర - రాజోలు : తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల మాంబ జయంతిని గురువారం రాజోలు కాటన్ పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మొల్ల మాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్లేటి కుర్తి వెంకటేశ్వర రావు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజోలు ఉప సర్పంచ్ పామర్తి రమణ, కాటన్ పార్క్ నిర్వాహకులు దార్ల పెద్దబాబు, పుల్లేటికుర్తి రత్నా రావు, సఖినేటిపల్లి పెద్ది రాజు, పుల్లేటికుర్తి శివాజీ, వెల్లా శ్రీనివాస్, దొడ్డిపట్ల శ్రీను పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన ఐఓటీ శిక్షణ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో బిల్డింగ్ స్మార్ట్ సిస్టమ్స్ యూసింగ్ ఐఓటీ అనే అత్యాధునిక అంశం పై అతిథి ఉపన్యాసం ఘనంగా ముగిసింది. ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో స్మార్ట్ సిస్టమ్స్‌ని బిల్డ్ చేసే రంగంలో చక్కటి పరిజ్ఞానాన్ని ఆపిల్ టన్ సంస్థ స్థాపకుడు ,అధినేత కనపర్తి బాపూజీ ఎంతో చక్కగా వివరించారు. ఆద్యంతం ఆచరణాత్మకం గా కొనసాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ఎన్నో సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. సిఎస్ఇ విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్పంచ్‌పై వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ

విశాలాంధ్ర - రాజోలు : అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గురువారం రాజోలు మండలం ములికిపల్లి గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ గుబ్బల లక్ష్మీ నీలిమ పై వార్డు మెంబర్లు, గ్రామస్థుల పలు ఆరోపణలు చేస్తూ ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నత అధికారులు విచారణ చేపట్టారు. సఖినేటిపల్లి ఈఓపిఆర్డీ కె సూర్య నారాయణ, రాజోలు ఈఓపిఆర్డీ రెహమాన్, లక్కవరం సెక్రటరీ అబ్బాస్ ఫిర్యాదుదారులు సమక్షంలో 12 అంశాల పై విచారణ జరిపారు. సర్పంచ్ పంచాయతీ నిధులు దుర్వినియోగం, ఏకపక్ష నిర్ణయాలతో గ్రామ అభివృద్ధికి ఎటువంటి కృషి చేయకపోవడం తదితర అంశాలపై వార్డు మెబర్లు, గ్రామ ప్రజలు డిపిఓకు ఫిర్యాదు చేశారు. దిని పై విచారణ చేపట్టిన అధికారులు నివేదికను అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట ఆంధ్రా జూబ్లీ బాప్టిస్ట్ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో గురువారం చర్చి ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సామర్లకోట పరిసర ప్రాంతాల నుండి కంటి పరీక్షలు నిమిత్తం సుమారు 200 మందిపైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ భవాని కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన 50 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం ఎంపిక చేశారు. వీరిని కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా జూబ్లీ బాప్టిస్ట్ చర్చి సంఘం కాపరి బీ కిరణ్ కుమార్, బీఎస్ వందనం, టి సూర్యారావు, బీ అన్నపూర్ణ దానియేలు, ఐఈ జీవన్ కుమార్, పిట్టా సత్యనారాయణ, జాన్ సుభాకర్, డాక్టర్ సూరిబాబు, అందుగుల రాధాకృష్ణ, టి కిరణ్, ఆర్ సిద్దు, కిరణ్ కంటి సిబ్బంది, ఈశ్వరి, శివ గణేష్, ప్రసాద్, శంకర్, సూర్య కుమారి, హైనా, హైమవతి, సునీత అశ్విని, సత్య పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షకిట్ల పంపిణీ

విశాలాంధ్ర - తాళ్లరేవు : మండలంలోని పి మల్ల వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పి మల్లవరం గ్రామానికి చెందిన "ధూళి పూడి, వుంగరాల, ముత్యాల, కత్తెర, కొమ్మి రెడ్డి, కామి శెట్టి, నూకల "తదితర కుటుంబ సభ్యులచే ఏర్పాటు చేసిన "తాతగారి కుటుంబం" వాట్సాప్ గ్రూప్ సభ్యులు సహకా రంతో పరీక్ష కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రి టైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎ సూర్యనారాయణ మూర్తి మాట్లా డుతూ ప్రతీ విద్యార్థి మొదటి ర్యాంకులో పాస్ అవడానికి పోటీపడాలి అన్నారు, వుంగరాల రవీంద్ర మాట్లాడుతూ క్యాష్ బహుమతి అందుకోవడానికి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు, వుంగరాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కష్టానికి ప్రతిఫలం మీ మీద ఆధారపడ ఉందన్నారు. ధూళిపూడి బాబి ఈ కార్యక్రమానికి సహక రిం చిన తాతా గారి కుటుంబ సభ్యులకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్ల చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసరావు, ధూళిపూడి సుభ, విశ్వ సత్యనారాయణ, సుబ్బారావు, నాగార్జున, రామకృష్ణ, కుమార్‌శ్రీ, ధూళిపూడి సుబ్రహ్మణ్యం, ప్రభాస, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు గర్వించదగ్గ కవయిత్రి 'మొల్ల'

విశాలాంధ్ర - కాకినాడ : బీసీలు గర్వించదగ్గ మంచి కవయిత్రి సుమారు 500 సంవత్సరాల క్రితమే రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన మహా కవయిత్రి మొల్ల. ఈమె కడప జిల్లాలో గోపవరం గ్రామానికి చెందినదిగా శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్న కవయిత్రిగా చరిత్ర చెబుతున్నది. కుమ్మరి అనే శాలివాహన బీసీ కులానికి చెందిన ఈమె ఆంధ్ర రాష్ట్రానికే కాదు భారతావనికి వన్నెతెచ్చిన మహాకవిత్రి అని శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డా చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా విచ్చేసి గజమాలతో ఆమె కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జగదీష్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జయకృష్ణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మెంటారావు, కుమ్మరి సంఘ అధ్యక్షులు శ్రీనివాసరావు, వీరభద్ర రావు, రాంబాబు, శాలివాహన సంఘ నాయకులు అనేకమంది, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంఆర్ఓ బీసీ కార్పొరేషన్‌కి చెందిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతులను ఎదిరించిన వీర వనిత మొల్లమాంబ

విశాలాంధ్ర - కాకినాడ : వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని అందరికీ అర్ధమయ్యే రీతిలో తెలుగులో రచించిన మొట్టమొదటి తెలుగు కవయిత్రిగా మొల్లమాంబ ప్రసిద్ధికెక్కిందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. కవయిత్రి ఆతుకూరి మొల్ల మాంబ (మొల్ల) జయంతి సందర్భంగా జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కాకినాడ రూరల్ మండలం స్థానిక బోట్ క్లబ్ వద్ద ఆమె విగ్రహానికి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యే పంతం నానాజీ, అధికారులు ఇతర ప్రజా ప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాలివాహన సంఘం ప్రతినిధులు ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ 15వ శతా బ్దంలో సమాజం లోని అసమానతులను సైతం ఎది రించిన వీర వనిత మొల్లమాంబ అని పేర్కొన్నారు. పండితులకే కాకుండా పామరులకు అర్థమయ్యేరీతిలో రామా యణాన్ని రచించి ప్రజలకు అందజేసిన కవయిత్రి మొల్లమాంబ గొప్ప దార్శ నికురాలని జేసీ కొనియాడారు. కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ మొల్ల తనలోని కవితా చాతుర్యంతో ఐదు రోజుల్లోనే రామాయణాన్ని రచించి తెలుగులో మొదటి కవిత్రి గా ఘనత సాధించారని ఆయన పేర్కొ న్నారు. శాలివాహన సంఘం వారికి ఏ ఇబ్బంది వచ్చినా తాను ఎప్పు డు అందు బాటులో ఉంటా నని ఆయన తెలి పారు. కార్యక్రమంలో బీసీ సంక్షే మ శాఖ అధి కారి కె లిల్లీ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాస రావు, జిల్లా పౌర సంబంధాల అధికారి నాగార్జున, కాకినాడ రూరల్ మండలం తహసిల్దార్ ఎస్ఎల్ ఎన్ కూమారి, శాలివాహన సంఘం నాయకులు, ప్రతినిధులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతి

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం కొత్త కాలనీకి చెందిన మార్గాని వీరబాబు భార్య కనక మహాలక్ష్మి (28) దంపతులకు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రెండవ కాన్పు మగబిడ్డ జన్మించడంతో వైద్యుల సలహా మేరకు నవజాత శిశువుకు గురక వస్తుందని కొత్తపేట భాస్కర చిల్డ్రన్స్ ప్రైవేటు హాస్పిటల్‌లో మంగళవారం జాయిన్ చేశారు. డాక్టర్లు గురువారం పంపిస్తామని చెప్పారు. తండ్రి వీరబాబుకు కాల్ చేసి సీరియస్‌గా ఉందని రాజమండ్రి విజయ చిల్డర్న్ ఆసుపత్రికి రిఫర్ చేయడంతో అక్కడ వైద్యులు పరీక్షించి చనిపోయినట్టు నిర్ధారించారు. రాత్రి శిశువుకు సిబ్బంది ఆక్సిజన్ అందించడంలో నిర్లక్ష్యం వహించడంతో మృతి చెందినట్లు తల్లితండ్రుల బంధువులు ఆరోపిస్తూ భాస్కర చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేత

విశాలాంధ్ర - కడియం : విద్యార్థులంతా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలకు హాజరై మంచి ఫలితాలను సాధించాలని గ్రామ సర్పంచ్ నల మామిడి కృపరాజు, గ్రామ పెద్దలు ఈదల వీరాస్వామి అన్నారు. వెలగతోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు కొట్ర లక్ష్మీనారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ రెడ్డి సురేష్, వైస్ చైర్మన్ పిల్లిల్లి మమత హాజరయ్యారు. విద్యాదాత ఈదల వీరాస్వామి విద్యార్థులకు పరీక్ష అట్టలు మరియు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వీరభద్రరావు, అలీ, శ్రీనివాస్, సఫీర్, ఏసురాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఫస్ట్ ఇయర్ ఇంటర్ పరీక్షలు పూర్తి

విశాలాంధ్ర - జగ్గంపేట : ఫస్ట్‌ఇయర్ ఇంటర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రమైన జగ్గంపేటలో ఏర్పాటు చేసిన 3 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు వ్రాశారు. వాటిలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 496 మందికి , 474 మంది హాజరు కాగా, 22 మంది గైర్హజరైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అక్షర కళాశాలలో 387 మందికి 374 మంది హాజరు కాగా, 13 మంది గైర్హాజరయ్యారని కళాశాల కరస్పాండెంట్ రవికిషోర్ చెప్పారు. అలాగే గురుకుల పాఠశాలలో 363 మందికి , 342 మంది హాజరు కాగా 21 మంది హాజరు కాలేదని ప్రిన్సిపాల్ రాజకుమారి తెలిపారు. స్క్వాడ్ వచ్చి పరీక్ష హాల్స్‌ను పరిశీలించినట్లు అమె పేర్కొన్నారు.

CHANGE OF NAME

I **MATHI ABHINASH** (new name) C/o Prakasham, Resident of Door No.5- 228, Church Peta, Near Lutheran High School, Sakhinetipalli Village & Mandal, Dr.B.R. Ambedkar Konaseema Dist., A.P. I Hence by declare that my Name has been changed from **MATHI BHAGYANANDAM** (Old Name) to **MATHI ABHINASH** (New Name). Hence all my documents and correspondence will continue with My New Name of **MATHI ABHINASH** .

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఆలమూరు : స్వయం ఉపాధి పథకాలకు అర్హులైన అభ్యర్థుల నుండి ఈనెల 22 లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఎల్పిఓ ఎంపీడీవో ఐ రాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. 2024-25 ఏడాదికి వెనుకబడిన తరగతులు ఆర్థికంగా వెనుకబడిన వివిధ సామాజిక వర్గాల వారికి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాపు సామాజిక వర్గం వారికి ఎంఎస్ఎంఇ పథకం ద్వారా చిన్న పరిశ్రమలు స్థాపించుకొనుటకు సబ్సిడీ లోన్లు మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు 18 నుంచి 50 ఏళ్ల లోపు వయసు వారికి, ఆధార్ కార్డు, మొబైల్, వైట్ రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు మీసేవ ద్వారా గాని, స్థానిక సచివాలయంలో గాని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమానాల నివృత్తి కోసం మండల పరి షత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్ పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - కరప : మానవ సేవయే మాధవ సేవగా తలచి ప్రతి ఒక్కరు సేవా భావం అలవర్చు కోవాలని, రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జెడి) జి నాగమణి పేర్కొన్నారు. కరప మండలం గురజానపల్లి గ్రామంలో పబ్బినీడి పాపా రావు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రసాదరావు ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, ఏపీజే అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలను ఆర్‌జెడి నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సేవా భావం కలిగి ఉండాలని, జాతి నాయకులను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని నాగమణి పేర్కొన్నారు. 70 వేల రూపాయలు ఖర్చుతో విగ్రహాలను ఏర్పాటు చేసిన ఐ ప్రసాద్ రావు మాస్టర్ సేవలు మరువలేని అన్నారు. అబ్దుల్ కలాం విగ్రహాన్ని కర్నాసుల పుష్పరాజ్, పబ్బినీడి వెంకటకృష్ణ, ప్రారంభించగా, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని పంపినీడి పాపారావు ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ సాయి మోహన్ మాట్లాడుతూ సంవత్సరంలో ఒక నెల జీతం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తారని పేర్కొన్నారు. యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష ఉపకారణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఉప విద్యా శాఖ అధికారి ఎన్ వెంకటేశ్వరరావు, కరప విద్యాశాఖ అధికారులు ఎంఈఓ, కేబి. కృష్ణవేణి, పి సత్యనారాయణ, విద్య కమిటీ చైర్మన్ నూకరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వీరవేణి, సర్పంచులు అనుసూరి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వివి రమణమూర్తి, యుటిఎఫ్ నాయకులు కే సత్తిరాజు, నగేష్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మరో మరపురాని ఘట్టానికి

పీఠాపురం వేదిక

- పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో - కాకినాడ : జనసేన పార్టీకి ఎన్నో మరుపురాని జ్ఞాపకాలిచ్చిన పిఠాపురం మరో మరపురాని ఘట్టం, పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం జయకేతనం సభకు వేదికైందని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నభూతో అన్న రీతిలో నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జయ కేతనం సభ ఏర్పాట్లను గురువారం నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. రాష్ట్ర నాయకులు, వివిధ కమిటీల సభ్యులతో సభా ప్రాంగణంలోనే నాదెండ్ల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సభకు పిఠాపురం నుంచే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి, రాష్ట్రంలోని నలువైపుల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి భారీగా జన సైనికులు, వీర మహిళలు తరలివస్తారన్నారు. దీనికి ఆవిర్భావ సభ కమిటీలు సమన్వయంతో పని చేయాలన్నారు. మచిలీపట్నం తర్వాత నిర్వహించనున్న అతి పెద్ద సభగా ఇది నిలుస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

పంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహ మూర్తి (బుజ్జి) ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఆదేశాల మేరకు మండల పంచాయతీలో పారిశుధ్య పనులకు ట్రాక్టర్లు, రైతులకు భరకాలు, డ్రమ్ములు, విత్తనాలు అందజేత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలోని 5 గ్రామాలకు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా పంచాయతీలలో ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచే విధంగా పారిశుధ్య పనులు చక్కగా జరిగాలనే ఉద్దేశంతో నూతన ట్రాక్టర్ల పంపిణీ చేశామన్నారు. అలాగే మండలంలో గల రాజ రైతులకు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారో గుర్తించి వారికీ భరకాలు, డ్రమ్ములు అందజేశామన్నారు. అదేవిధంగా అగ్రికల్చర్‌లో భాగంగా గ్రామాలలో చిన్న, సన్న కారు రైతులను గుర్తించి వారికి కూడా కొత్త విత్తనాలను మ పంపిణి చేయడం జరిగిందన్నారు. అనంతరం వెలుగు సిబ్బందికి అక్షర భారతి కార్యక్రమం ద్వారా వారికీ కిట్లు మరియు గౌరవ వేతనంగా 400 రూపాయలను అందజేశారు. ఎర్రవరంలో ఇటీవలే చీ=+ూ పథకం (ఉపాధి హామీ పథకం)లో పని చేస్తూ ప్రమాదం జరిగి చనిపోయిన ఒక వ్యక్తికి 50 వేల రూపాయలు రావడం జరిగింది అని ఆయన తెలియజేసారు. అలాగే గతంలో ఇలాంటి కార్యక్రమాలు జరగలేదని, మండలంలో ఈరోజు శుభదినంగా భావిస్తున్నాని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ 2 సాదే లావరాజు, మండల నాయకులు, కూటమి శ్రేణులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తమ్మిలేరు మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి: సీపీఐ

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : మహాశివరాత్రి పురస్కరించుకుని నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరు మండలం బలివే, తమ్మిలేరులో పుణ్యస్నానాలకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ సీపీఐ నాయకులు నూజివీడు సబ్ కలెక్టర్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ బలివే ఉత్సవాలలో పుణ్య స్నానాలు చేస్తూ ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటనపై ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. బాధిత కుటుంబాలు చాలా పేదలని చేతికి వచ్చిన బిడ్డలు కోల్పోవటం కుటుంబాలకు తీరని లోటు అన్నారు. ప్రభుత్వ అధికారుల సమన్వయం లోపం వల్ల ఈ ఘటన జరిగిందన్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్రత విచారణ జరిపి బాధిత కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ స్పందిస్తూ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, కొక్కెరపాటి ఆనంద్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలపై ప్రజలకు చైతన్యం కలిగించాలి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవలపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం కలిగించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం ఏలూరు, భీమడోలు కోర్టుల పరిధిలోని ప్యానల్ న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్యానల్ న్యాయవాదులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని చెప్పారు. అదేవిధంగా న్యాయ విజ్ఞాన సదస్సులలో పాల్గొని ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగించడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పొందటానికి అర్హులైన వారికి అవసరమైన పక్షంలో న్యాయ సహాయాన్ని అందించాలని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నియమించబడిన న్యాయవాదులు ఆయా కేసులను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఈనెల 17వ తేదీ నుండి జరగబోయే పదోతరగతి పరీక్షల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. అదేవిధంగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు సహాయ సహకారాలు అధికారులు అందించాలని ఆదేశించారు. ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జెడ్పీ, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. జడ్పీ చైర్మన్ పద్మశ్రీ మాట్లాడుతూ సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల నిర్వహణ, శుభ్రత, భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశించారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ ఇంచార్జ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.భీమేశ్వరావు, జేడీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - భీమవరం : అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 15 వ తేదీన భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అర్జీదారులతో వ్యక్తిగత దరఖాస్తులు జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. గురువారం భీమవరం పట్టణం నెహ్రు కాలనీ వద్ద ఇళ్ళు లేని పేదలతో ఇంటి స్థలాల అర్జీలు పూరింప చేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పేదలు గజం భూమి కూడా కొనలేని పరిస్థితుల్లో ఉన్నారని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఒక పక్క, వారి ఆదాయంలో సగం ఇంటి అద్దెలకు పోతుందన్నారు. పేదలు అద్దె ఇళ్ళల్లో కాకుండా సొంత ఇళ్ళల్లో వుండే పరిస్థితి కల్పిస్తే ప్రతీ పేద కుటుంబానికి నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయల వరకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. తక్షణమే పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. జగనన్న నివేశన స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకోలేని లబ్దిదారులకు కూడా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని భీమారావు డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోనాల డిమాండ్ చేశారు. ప్రతీ పేద కుంటుంబం ఇంటి స్థలం పొందే వరకు పోరాటం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు ఎం.లక్ష్మీపతి, ప్రజానాట్యమండలి నాయకులు చాన్ బాషా, అర్జీదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పింఛనుదారుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - కాకినాడ : ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పూర్వ సభాపతి, ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్‌ని మరియు ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్‌ని గౌరవ పూర్వకంగా తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛను దారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సలాది సాయి సత్య నారాయణ, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగ సంఘ పూర్వ ప్రాంతీయ కార్యదర్శి, ప్రస్తుత గాంధీనగర్ బ్రాంచ్ లైబ్రరీ గ్రేడ్ 2 లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావులు కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పిం ఛను దారులకు 010 పద్దు ద్వారా జీతములు, పింఛన్లు మంజూరు చేయాలని కోరడమైనది. గౌరవ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించి, 010 పద్దు అమలుకు ప్రభుత్వం తరపున కృషి చేస్తామన్నారు.

జనసేన జయకేతనం సభకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - పిఠాపురం : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవంనకు సంబంధించి సభను భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు జనసేన పిఏసి సభ్యుడు మంత్రి నాదెండ్ల మనోహర్, మరో మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ సభకు భారీ ఎత్తున జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు హాజరవుతారన్నారు. ఈ సభ ద్వారా గిరిజన, జిల్లా, పిఠాపురం అభివృద్ధిపై ఒక ప్రతినిధి ప్రసంగం చేస్తారని, పిఠాపురం రాజా, డొక్కా సీతమ్మ, నాయకర్ వంటి మహనీయుల పేర్లను ప్రాంగణాలకు పెట్టామని వారు చెప్పారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి : చిత్రాడలోని సభ ప్రాంగణం వద్ద గురువారం మాట్లాడారు. ఈ సభ పిఠాపురం మండ లంలోని చిత్రాడ గ్రామంలో భారీ ఎత్తున నిర్వహించ నున్నారు. శుక్రవారం జరిగే ఈ సభకు లక్షలాదిమంది జనసైనికులు వస్తారని అంచనా వేస్తున్నారు. డిజైన్లతో ఏర్పాటు చేసిన స్టేజి అందర్నీ ఆకట్టుకున్నాయి. సభకు హాజరయ్యే వాళ్ళకు కనిపించేలా పలు స్క్రీన్లను భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. ఇప్పటికే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మినహా అన్ని స్థాయిల్లో ఉన్న జనసేన నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, అరవ శ్రీధర్, పంచకర్ల రమేష్ బాబు, ఆరని శ్రీనివాస్, లోకం మాధవి, జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు తదితరులు పాల్గొన్నారు.

15న స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

కలెక్టర్ షన్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో ఈ నెల 15వ తేదీన ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్చంద్రా- స్వర్ణాంధ్ర కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అధికారులను ఆదేశిం చారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యా లయం నుంచి జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో కలెక్టర్ టేలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందిం చిన యాప్ నందు స్వచ్చంద్రా కార్యక్రమాల వివరాలను నమోదుచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతినెల మూడవ శనివారం ఒక అంశాన్ని ప్రామాణికంగా తీసుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈనెల 15వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్, మార్కెట్ యార్డు, రైతు బజార్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా పర్యావరణానికి , ప్రజలకు కలిగే మేలు పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టే ఈ కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో పొందుపంచి, కార్యక్రమాలకు ఫోటోలు తీసి స్వచ్చాంధ్ర వెబ్ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాలపై రాష్ట్రస్థాయిలోనూ పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. శ్రద్ధతో నిక్కచ్చిగా కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల తహశీల్దారు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీలు, కాపరువైరు దొంగలించిన కేసులో

ఇద్దరికి 14 రోజుల రిమాండు

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : బిఎస్ఎన్ఎల్ కార్యాలయాలు లక్ష్యంగా చేసుకుని పలు బ్యాటరీలు, కాపర వైరు దొంగలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ ఎల్ శ్రీను నాయక్ తెలిపారు. గురువారం శ్రీను నాయక్ మాట్లా డుతూ నిందితులు కొల్లిపర రూపా శేషబాబు, పతి అమర్నాథ్‌ను అరెస్టు చేసి విచారించగా ముమ్మిడివరం, యానం, తిమ్మాపురం, రామచంద్ర పురం, ప్రకాష్ నగ ర్, అనపర్తి ప్రాంతాల్లో నేరాలు చేసినట్లు అంగీక రిం చారని చెప్పారు. 8 బ్యాటరీలు, 85 మీటర్ల కాపర్ వైర్, వెర్నా కారు సీజ్ చేసి కోర్టులో హాజరు పరచగా నింది తులకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

స్త్రీ శక్తి సాధికారతకు టిడిపి పెద్దపీట : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : తెలుగునాట స్త్రీ శక్తి సాధికారతకు సాధించే దిశగా తెలుగుదేశం పార్టీ తొలినుండీ పెద్దపీట వేస్తూ వస్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో గురు వారం ఆయన మాట్లాడారు. తమ ఇంటిని సమర్థ వంతంగా తీర్చిదిద్దే శక్తివంతులైన మహిళలు రాజకీయాల్లో నూ మరింత రాణించే విధంగా టిడిపి వ్యవస్థా కులు, మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు కృషిచేశారని గుర్తు చేశారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఘన తను ఎన్టీఆర్ సొంతం చేసుకున్నారని కొని యాడారు. దానికి కొనసాగింపుగా ప్రస్తుతం నవ్యాంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి గాను 3 లక్షల 22 వేల 359 కోట్ల రూపాయలతో వార్షిక బడ్జెట్ను ఏపి శాసన సభలో ప్రవేశపెడితే, అందులో మహిళా, శిశు సంక్షేమానికే 4 వేల 332 కోట్ల రూపాయల భారీ నిధులను కేటాయించడం అభినందనీయ మన్నారు. దీంతో రాష్ట్ర బడ్జెట్ను మహిళా పక్షపాతి బడ్జెట్గా అనేక మంది అభివర్ణిస్తున్నా రన్నారు. మహిళల సంక్షేమానికి, ఆర్థిక పరిపుష్టికి తోడ్పాటు అందించేందుకు ఈ బడ్జెట్ ఎంతో దోహదమని ఆయన స్పష్టం చేశారు. గతంలో మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయ ంగా డ్వాక్రా పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. తద్వారా ఎంతో మంది మహిళల జీవన ప్రమాణా లను పెంచిన ఘనతను ముఖ్యమంత్రి చంద్ర బాబుకే దక్కుతుందని కొనియాడారు. రానున్న కాలంలో మహి ళలకు మరిన్ని మేళ్ళు చేకూర్చే బాధ్యతను కూటమి ప్రభుత్వాధినేతలు అత్యంత సమర్థ వంతంగా నిర్వర్తించేందుకు కర్తవ్య సహితులై, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే చంటి స్పష్టం చేశారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర చింతలపూడి: రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా అన్నారు. చింతలపూడి మండలంలో ప్రగడవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఏడిఏ నాగ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా హబీబ్ భాష మాట్లాడుతూ రైతులు ప్రతి ఒక్కరు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని చింతలపూడి మండలంలో 11050 మంది రైతులు నమోదు చేసుకున్నారని 2500 మంది ఇంకా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.విశిష్ట సంఖ్య నమోదు చేసుకోకపోతే ప్రభుత్వ పథకాలకు రైతులు అర్హులు కారని ఆయన అన్నారు.వరి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. మండల వ్యవసాయ అధికారి మీనా కుమారి, ఎంపీ ఈవో, రైతులు పాల్గొన్నారు.

మావురమ్మ ఆలయం ముఖ ద్వారానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు బంగారు వారి చెరువు గట్టు నా వెలసిన. శ్రీ శ్రీ శ్రీ మావురమ్మ అమ్మ వారి జాతర సందర్భంగా రావిచెట్టు సెంటర్లో అమ్మవారి ఆలయముఖ ద్వారం నిర్మాణానికి కర్నేన గౌరు నాయుడు రోజారమణి దంపతులు శ్రీకారం చుట్టారు. గురువారం ఆలయ ముఖ ద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆలయ అధ్యక్షుడు శంక రావు శ్రీనివాస్, రౌతు అచ్యుతరావు, కనమర్లపూడి చిన్న, వరదా శేషు, కోరుకొండ సుబ్బారావు, పల్లం పాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల వనవిహారం

విశాలాంధ్ర - కడియం : తూర్పుగోదావరి జిల్లా పిఎం శ్రీ పాఠశాలల స్కౌట్ అండ్ గైడ్స్ పెట్రోల్ లీడర్స్ నాలుగో రోజు శిక్షణా తరగతులు సందర్భంగా ఉదయం ఏపిల్ల ధనలక్ష్మి ఆధ్వర్యంలో గైడ్ విద్యార్థులు సర్వమత ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం స్థానిక మినర్వా విద్యా సంస్థల సహకారంతో నాలుగు బస్సుల్లో 160 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు పల్ల వెంకన్న నర్సరీని సందర్శించి అక్కడ మొక్కలను పరిశీలించి, వాటి వివరాలను పుస్తకాల్లో నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా క్యాంప్ నిర్వాహకులు మినర్వా స్కూల్ యాజమాన్యం కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం క్యాంపు ఇన్చార్జ్ గొల్లపల్లి సత్యనారాయణ, స్కౌట్ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, గైడ్ ఉపాధ్యాయినీలు, ఎయంఒ, సియంఒ లు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము కాంట్రాక్టు సిబ్బంది. లోగల గ్రామ పంచాయతీలలో కాంట్రాక్టు పద్ధతి పై పని చేయు చున్న మేము అందరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో గల వివిధ గ్రామ పంచాయతీ లలో ట్యాంక్ వాచర్, ఎవిన్యు వాచర్, గేట్ వాల్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, ఇలా వివిధ రకాల పేర్లతో గల జిల్లా పంచాయతీ అధికారి ఆర్డర్తో గత 20-30 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ నుండి చాలిచాలని జీతాలు తీసుకొంటు పనిచేయుచున్నం .గ్రామ పంచాయతీలు అనగా ప్రభుత్వ సంస్థలు అనే ఉద్దేశ్యముతో ఎప్పటికైన మా ఉద్యోగములు రెగ్యులర్ అయ్యి మా జీవితాలు బాగుంటాయని ఆశించి ఎన్నో సంవత్స రాలనుండి మేము పనిచేయుచుండగా మా ఉద్యోగములు పర్మినెంటు కాక మా కుటుంబములను పోషించలేక, పిల్లలను చదివించు కోలేక అనేక ఇబ్బందులు పడుచున్నాం. గతంలో రెవిన్యు డిపార్టుమెంటులో గ్రామ నౌఖర్లుగా పనిచేస్తూ 10వ తరగతి పాస్ అయిన వారిని గ్రామలుగా ప్రమోషన్ ఇచ్చి ఉన్నారు. కాని గ్రామ పంచాయతీలలో పని చేయుచున్న మాకు మాత్రం నేటి వరకు ఎటువంటి న్యాయము జరగలేదు. గత ప్రభుత్వములకు మేము ఎన్నిసార్లు మా సమస్యను విన్నవించుకొన్నాను నేటి వరకు మా సమస్య పరిష్కరించబడలేదు. గ్రామ పంచాయతీలలో ఖాళీ ఉన్న బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్ ఆఫీస్ అటెండర్ మొదలగు పోస్ట్లలోకు అవకాశం ఇప్పించి మాకు న్యాయం చేయించ హృదయపూర్వకముగా కోరుతున్నాం.

పెద శంకర్ల పూడిలో గిరిబాబు పర్యటన



విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు దళే చిట్టిబాబును వైసీపీ నియోజవర్గ నియోజవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిట్టిబాబు త్వరగా కోలుకోవాలని పార్టీకి సేవలందించాలన్నారు. గ్రామంలో వైసీపీ నాయకులు జల్లిగంపల ప్రభాకర్ రావు, రామిశెట్టి నాని, బంక్ శ్రీను, గుడాల వెంకటరత్నం, సేర్ కృష్ణ, గొల్లపల్లి దొరబాబు, గోల జయ శేఖర్ కార్యకర్తలు అభిమానులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : జాతీయ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లు గురువారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరిడెంట్ శైలజ మాట్లాడుతూ జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్ మోర్త వెంకటేష్, యోహానులు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమని, ఈ రక్తదాన శిబిరం వల్ల రక్తం అవసరమైన వారికి వెంటనే అందజేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో వైద్యులు సౌమ్య, రమేష్, ల్యాబ్ టెక్నీషియన్లు త్రిమూర్తులు, మధు, రవి, సౌజన్య, శ్రీను, గణేశులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్లరేవు మండలం నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి కంచర్ల లక్ష్మీ నారాయణ కుమారుడు, కోడలు డా కీర్తిమాన్, డా భవానీ సాగర్, మాట్లాడుతూ జరుగు తున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని సూచించారు. అనంతరం డాక్టర్ సాగర్ తండ్రి కంచర్ల లక్ష్మీనారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి, కలికిమూర్తి, కంచర్ల వీరయ్య (చిన్నబ్బాయి)తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరప విద్యార్థులకు సైన్స్ క్విజ్

విశాలాంధ్ర - కరప : కరప నక్క సూర్యనారా యణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ భారత ప్రభుత్వ రంగ సంస్థ వారిచే సైన్స్ క్విజ్ పోటీలను నిర్వహించుట జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతిని అందించారు. బిఐఎస్ సంస్థ విజయవాడ శాఖ వారిని విద్యార్థులు అభినందించారు. స్టాండర్డ్స్ క్లబ్ మెంటర్గా హిందీ ఉపాధ్యాయులు మహబూబ్ ఆలీ షేక్, స్టాఫ్ సెక్రెటరీ శ్రీరామ్ చంద్ర మూర్తి, ఎన్ ప్రసాద్ కుమార్, వి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.